సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం । 24 । ఆగస్టు । 2023



పోలీసుల ముమ్మర తనిఖీలు

ముంచంగిపుట్టులో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు.జీపులు, ద్విచక్ర వాహనాలను పరిశీలించారు. IIలో



ఇస్కాన్‌లో విద్యార్థులకు పోటీలు

శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా సాగర్‌నగర్ ఇస్కాన్ టెంపుల్‌లో విద్యార్థులకు ఈ నెల 27 నుంచి పోటీలు నిర్వహించనున్నారు. IIలో



120 కిలోల గంజాయి పట్టివేత

గిన్నెలకోట పంచాయతీ చింతగరువు జంక్షన్‌లో ఆటోలో తరలిస్తున్న తరలిస్తున్న 120 కిలోల గంజాయిని పట్టుకున్నారు. IIలో

న్యూస్‌రీల్

11 మంది టీడీపీ నేతలపై కేసు నమోదు

- ప్రజాప్రతినిధులను అడ్డుకోవడంపై ఫిర్యాదు

మారేడుమిల్లి: మండలానికి చెందిన 11 మంది టీడీపీ నేతలు, కార్యకర్తలపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఎస్‌ఐ రాము కథనం మేరకు ఇలావున్నాయి. ఈనెల 18వ తేదీన రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ మండల పర్యటనలో భాగంగా బోదులూరు, చాట్లవాడ గ్రామాల్లో అభివృద్ధి పనుల ప్రారంభ కార్యక్రమాలకు బయలుదేరారు. వారిని మార్గం మధ్యలో కుట్రవాడ వద్ద టీడీపీ నేతలు పల్లాల రాజుకుమార్ రెడ్డి, రేవుల జానకి రెడ్డితో పాటు తొమ్మిది మంది అడ్డుకున్నారు. దీనిపై జెడ్పీటీసీ గొర్లె బాలాజీ బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రభుత్వ కార్యక్రమాలకు వెళ్తున్న ప్రజాప్రతినిధులను అడ్డుకున్నందుకు వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

త్వరితగతిన కల్వర్టు నిర్మాణం

- ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే



గండిపడిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఈఈ సుబ్బరాజు

సాక్షి ఎఫెక్ట్..

చింతూరు: మండలంలోని వేములరాయి రహదారిలో గండిపడిన ప్రాంతంలో త్వరితగతిన కల్వర్టు నిర్మాణం చేపట్టాలని ఐటీడీఏ పీవో సూరజ్ ధనుంజయ్ గనోరే పంచాయతీ రాజ్ అధికారులను ఆదేశించారు. భారీవర్షాలకు రహదారి కొట్టుకుపోయిన వైనంపై బుధవారం సాక్షిలో ప్రచురితమైన 'వేములరాయి రహదారికి గండి' కథనంపై ఆయన స్పందించారు. గండిపడిన ప్రాంతంలో వెంటనే కల్వర్టు నిర్మాణానికి చర్యలు చేపట్టాలని పంచాయతీరాజ్ ఏఈ ఆచారిని పీవో ఆదేశించారు. ఇప్పటికే గండి పడిన ప్రాంతాన్ని ఈఈ సుబ్బరాజు పరిశీలించారని, త్వరలోనే పనులు ప్రారంభించి కల్వర్టు నిర్మాణం పూర్తి చేస్తామని పీవోకు ఏఈ తెలిపారు. దీంతోపాటు గొడ్లగూడెం నుంచి గూడూరు జంక్షన్ నడుమ గోతులు పడిన సీసీ రహదారి మరమ్మతులకు ప్రతిపాదనలు పంపుతామని ఏఈ తెలిపారు.

అటవీశాఖ అధికారులపై ఫిర్యాదు



పీవో సూరజ్ గనోరేకు ఫిర్యాదు చేస్తున్న ఎర్రగొండపాకల కొండరెడ్లు

చింతూరు: అటవీ హక్కుల చట్టం ప్రకారం కేటాయించిన భూములు సాగుచేస్తుంటే అటవీ అధికారులు అడ్డుకుంటున్నారని మండలంలోని ఎర్రగొండపాకలకు చెందిన కొండరెడ్లు బుధవారం ఐటీడీఏ పీవో సూరజ్ ధనుంజయ్ గనోరేకు ఫిర్యాదు చేశారు. స్పందనలో భాగంగా పీవోను కలిసిన వారు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తమకు అటవీ హక్కుల చట్ట ప్రకారం రహదారి పక్కనే భూములు కేటాయించారన్నారు. వాటిలో సాగు చేయవద్దని, ఇళ్లు కట్టవద్దంటూ అటవీ అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని వారు పీవోకు తెలిపారు. దీనిపై అటవీ అధికారులతో మాట్లాడి తగిన చర్యలు చేపడతామని పీవో వారికి హామీ ఇచ్చారు.

టంగుటూరి, గిడుగు సేవలు ఎనలేనివి



ప్రకాశం పంతులు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ప్రభాకర్‌రావు, వెంకటేశ్వరరావు

పాడేరు రూరల్ : తెలుగు భాషాభివృద్ధికి తెలుగు వెలుగు గిడుగు రామ్మూర్తి పంతులు, సంఘ సంస్కర్త టంగుటూరి ప్రకాశం పంతులు సేవలు ఎనలేనివని ఐటీడీఏ ఏపీవోలు ప్రభాకర్‌రావు, వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఐటీడీఏలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీడీ మురళి, ఐటీడీఏ పరిపాలనాధికారి హేమలత, ఐటీడీఏ, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.



ఇస్రో అక్షర నమూనాలో గౌరిదేవిపేట హైస్కూల్ విద్యార్థులు



రాజవొమ్మంగిలో ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షిస్తున్న విద్యార్థినులు



చంద్రయాన్-3 అక్షర రూపంలో గంగవరం విద్యార్థినులు



పాడేరు తలారిసింగి పాఠశాలలో విద్యార్థుల సందడి

ఉప్పొంగిన ఆనందం

అంతరిక్ష రంగంలో భారత్ సరికొత్త చరిత్ర లిఖించింది. ఇప్పటివరకు ఏ దేశమూ చేరుకోని చంద్రుని దక్షిణ ధ్రువంపై విక్రమ్ ల్యాండర్‌ను సురక్షితంగా దింపి జయ కేతనం ఎగురవేయడంతో అన్నివర్గాల్లో ఆనందం ఉప్పొంగింది. ఇస్రో శాస్త్రవేత్తలకు విభిన్నంగా అభినందనలు తెలిపారు.

సాక్షి, పాడేరు: చంద్రయాన్-3 విజయవంతంపై కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ తుహిన్‌సిన్హా, పాడేరు, రంపచోడవరం ఐటీడీఏ పీవోలు వి.అభిషేక్, సూరజ్‌గనోరే, అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, పాడేరు, రంపచోడవరం, అరకు ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, నాగులాపల్లి ధనలక్ష్మి, చెట్టి పాల్గుణ హర్షం వ్యక్తం చేశారు.

ఎటపాక: మండలంలోని గౌరిదేవిపేట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇస్రో అక్షర నమూనాగా ఏర్పడి శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు.

రాజవొమ్మంగి: చంద్రయాన్-3 విజయవంతం కావడంతో పలు పాఠశాలల్లో విద్యార్థులు జయహో భారత్ అంటూ నినాదాలు చేశారు. రాజవొమ్మంగి గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల చిన్నారులు జేజేలు పలికారు. ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం బుధవారం ఏర్పాటుచేసిన చంద్రయాన్-3 ప్రత్యక్ష ప్రసారాన్ని వారు తిలకించారు. ఈ సందర్భంగా వారికి సైన్స్ ఉపాధ్యాయులు రవికుమార్, సింహాచలం, లోవకుమారి చంద్రయాన్-3పై అవగాహన కల్పించారు.

గంగవరం: మండలంలోని కొత్తాడ కస్తూర్బా గాంధీ విద్యాలయంలో బాలికలు చంద్రయాన్-3 విజయవంతాన్ని కాంక్షిస్తూ అక్షర నమూనాలో నిర్వహించిన ప్రదర్శన ఆకట్టుకుంది.



ఇస్రో అక్షర రూపంలో గంగవరం ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు

ప్రాధాన్య భవన నిర్మాణాలు వేగవంతం

- అడ్వాన్సు తీసుకుని పనులు చేపట్టని కాంట్రాక్టర్లపై చర్యలు
- కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: జిల్లాలోని అన్ని ప్రాధాన్యత భవన నిర్మాణాలను వేగంగా పూర్తిచేయాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదని కలెక్టర్ సుమిత్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశం నుంచి జిల్లాలోని ఇంజనీరింగ్ అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. జిల్లాలోని భవన నిర్మాణాల పరిస్థితిపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పలు సూచనలు చేశారు. అడ్వాన్స్‌లు తీసుకుని పనులు చేపట్టని కాంట్రాక్టర్లను గుర్తించి, వారి నుంచి నిధులు రికవరీ చేయాలని ఆదేశించారు. కొత్త కాంట్రాక్టర్లకు ఆయా పనులు అప్పగించాలని కలెక్టర్ సూచించారు. డుంబ్రిగుడ, అనంతగిరి మండలాల్లో ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలకు కాంట్రాక్టర్లు దొరకడం లేదని ఇంజనీరింగ్ అధికారులు చెబుతుండగా అయితే ప్రాధాన్యత లేని పనులను మాత్రం కాంట్రాక్టర్లు చేయడంపై కలెక్టర్ ఆసహనం వ్యక్తం చేశారు. దీనిపై విచారణ చేపట్టి తనకు నివేదిక ఇవ్వాలని పాడేరు ఐటీడీఏ పివో వి.అభిషేక్‌ను ఆదేశించారు. పాడేరు నియోజకవర్గంలో పనుల ప్రగతి మెరుగ్గా ఉందని, అయితే అరకులోయలో మాత్రం పురోగతి సాధించాల్సి ఉందన్నారు. రంపచోడవరం నియోజకవర్గంలో పనులను వేగంగా పూర్తి చేయాలని ఐటీడీఏ పీవో సూరజ్ గనోరేను ఆదేశించారు. డుంబ్రిగుడ, అనంతగిరిల్లో కాంట్రాక్టర్లు అశోక్, సుబ్బారెడ్డిని 10 రోజుల్లోగా పనులు ప్రారంభించని పక్షంలో వారిద్దరిని బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని, సంబంధిత డీఈఈకి షోకాజ్ నోటీసు జారీచేయాలని పంచాయతీరాజ్ ఈఈ కొండయ్యపడాల్‌ను ఆదేశించారు. పూర్తయిన పనులకు సంబంధించి బిల్లుల సమగ్ర వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. బిల్లుల అప్‌లోడ్ చేయని వారిపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న రెండు రోజుల్లో పెండింగ్ బిల్లులు అప్‌లోడ్ చేయాలని ఆయన ఆదేశించారు. పంచాయతీరాజ్ ప్రాజెక్టుల ఈఈ లావణ్యకుమార్ ఈ సమావేశంలో పాల్గొన్నారు.

సకాలంలో నిత్యావసరాల పంపిణీ

- జాప్యం చేస్తే చర్యలు
- కలెక్టర్ సుమిత్‌కుమార్ హెచ్చరిక



హాజరైన ఐసీడీఎస్ అధికారులు, సూపర్‌వైజర్లు

సాక్షి, పాడేరు: అంగన్‌వాడీ కేంద్రాలకు నిత్యావసర సరుకులు పంపిణీలో జాప్యం చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సుమిత్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్‌లో సీడీపీవోలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లతో నిర్వహించిన సమావేశంలో పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా తల్లులకు, చిన్నారులకు నాణ్యమైన పోషకాహారం అందించాలని ఆదేశించారు. ప్రతి నెలా 20 నుంచి 30 అంగన్‌వాడీ కేంద్రాఅలను సందర్శించాలని సూచించారు. గుడ్లు, పాలు, వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల నాణ్యతను విధిగా తనిఖీ చేయాలని ఆదేశించారు. గుడ్లుచిన్నవిగా ఉన్నా, పాలప్యాకెట్లు సక్రమంగా లేకపోయినా, నిత్యవసర సరుకుల నాసిరకంగా ఉన్నా వెంటనే తిరస్కరించాలని సూచించారు. సీడీపీవోలు, సూపర్‌వైజర్లు గుడ్లు గొడౌన్లను పరిశీలించి గుడ్లట్రేలను తనిఖీ చేయాలని ఆదేశించారు. ఒక గుడ్డు కచ్చితంగా 50 గ్రాములు ఉండాలని చెప్పారు. కాంట్రాక్టర్లు నిర్దిష్టమైన గడువులోగా నిత్యావసర సరుకులను సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ విషయంలో వారు జాప్యం చేస్తే జరిమానా విధించాలని పీడీని ఆదేశించారు. నెట్‌వర్క్ సదుపాయం లేని అంగన్‌వాడీ కేంద్రాల వివరాలను సమర్పించాలని ఆదేశించారు. ఐసీడీఎస్ పీవో సూర్యలక్ష్మి, పర్యవేక్షకులు రామచంద్రమూర్తి పాల్గొన్నారు.

మన్యం సీతాఫలం..
రుచి మధురం

మన్యం సీతాఫలం ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతోంది. వంట్లమామిడి మార్కెట్లో తెలుగు రాష్ట్రాలతో పాటు పశ్చిమ బెంగాల్ వ్యాపారులు పోటీపడి కొనుగోలు చేస్తున్నందున గిరి రైతులు మంచి ఆదాయం పొందుతున్నారు.





వంట్లమామిడిలో సీతాఫలం అమ్మకాలు

- పోటీపడి కొనుగోలు చేస్తున్న వ్యాపారులు
- ఇతర రాష్ట్రాల నుంచి వ్యాన్లతో తరలింపు
- వాణిజ్యపరంగా సాగు
- గిరి రైతులకు మంచి ధర
- కావిడ పండ్లు రూ.1400 నుంచి రూ.2 వేలు

సాక్షి,పాడేరు: మన్యం సీతాఫలాలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. రుచికరంగా ఉన్నందున వ్యాపారులు పోటీపడి కొనుగోలు చేస్తుంటారు. జిల్లాలో అనంతగిరి, పాడేరు, జి.మాడుగుల, చింతపల్లి మండలాల్లో సీతాఫలం తోటలు విస్తారంగా ఉన్నాయి.

- పాడేరు మండలంలోని వంట్లమామిడి, మోదాపల్లి, సలుగు, కక్కి, దేవాపురం, జి.మాడుగుల మండలం వంతాల పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాల్లోను గిరి రైతులు సుమారు 500 ఎకరాల్లో సీతాఫలం తోటలను సాగు చేస్తున్నారు. కొండపోడు, మెట్ట భూముల్లో నాటిన మొక్కలు నేడు ఫలసాయాన్ని ఇస్తున్నాయి.
- మార్కెట్ పరిస్థితులు కలిసివస్తే గిరిజనులు ఎకరాకు రూ.40 వేల వరకు ఆదాయం పొందుతున్నారు. మార్కెట్లో ఒక్కొక్క వారం ధరల హెచ్చుతగ్గులు ఉన్నప్పటికి మొత్తంగా చూసుకుంటే సీతాఫలాల ద్వారా మంచి ఆదాయం పొందుతున్నారు.
- పాడేరు మండలం వంట్లమామిడి, 12వమైలురాయి జంక్షన్ జూలై నుంచి అక్టోబర్ వరకు సీతాఫలాల అమ్మకాలతో సందడిగా ఉంటాయి. అనంతగిరి మండలంలోని డముకు, కాశీపట్నం, చింతపల్లి మండలంలోని చిత్రాలగుప్ప ప్రాంతాల్లోను సీతాఫలాల అమ్మకాలు భారీగానే జరుగుతున్నాయి.
- ఏపీతో పాటు తెలంగాణ, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలకు విశాఖ ఏజెన్సీలోని వంట్లమామిడి కేంద్రంగా సీతాఫలాలు భారీగా రవాణా అవుతున్నాయి. వ్యాపారులంతా పోటా పోటీగా కొనుగోలు చేఇస ఎగుమతి చేస్తున్నారు.
- పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని కోల్‌కతా, ఒడిశాలోని భువనేశ్వర్ ప్రాంతాలకు చెందిన పండ్ల వ్యాపారులు నేరుగా వంట్లమామిడి మార్కెట్‌కు వస్తున్నారు. ప్రతి ఆది, బుధ, శుక్ర వారాల్లో సీతాఫలాలను కొనుగోలు చేస్తున్నారు.
- రాజమండ్రి, కాకినాడ, గాజువాక, విజయవాడ, తాడేపల్లిగూడెం, అనకాపల్లి ప్రాంతాలకు చెందిన వ్యాపారులు ఇక్కడ కొనుగోలు చేసి స్థానిక మార్కెట్లలో రిటైల్ అమ్మకాలు జరుపుతున్నారు.
- మార్కెట్లో సీతాఫలాల ధర ఆశాజనకంగానే ఉంది. రెండు పెద్ద బుట్టల్లో సుమారు 150 నుంచి 200 వరకు పండ్లు ఉంటాయి. వీటిని కావిడ లెక్కన రూ.1400 నుంచి రూ.2 వేలకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు.
- గిరిజనులు వంట్లమామిడి ప్రాంతానికి కావిళ్లతో మోసుకువచ్చి అమ్మకాలు చేస్తుంటారు. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో దిగుబడి బాగుంది. మార్కెట్లో మంచి ధర ఉండటంతో గిరి రైతుల్లో ఆనందం నెలకొంది.

రూ.25 వేల ఆదాయం



సీతాఫలాలను వంట్లమామిడి మార్కెట్‌కు తీసుకువచ్చి విక్రయిస్తున్నాం. ఇతర రాష్ట్రాల నుంచి వ్యాపారులు రావడం వల్ల పోటీపడి కొనుగోలు చేస్తున్నారు. ఐదు వారాలనుంచి మారెక్‌ట్‌కు తీసుకువెళ్లి విక్రయించగా రూ.25 వేల వరకు ఆదాయం వచ్చింది. ఇంటిల్లపాది కష్టపడి పనిచేస్తున్నాం.

– కూడా బాలన్న, గిరిజన రైతు, సంగం, జి.మాడుగుల మండలం

మార్కెట్లో మంచి గిరాకీ



ఏజెన్సీలో గిరిజన రైతులు సాగు చేస్తున్న సీతాఫలాలు మంచి రుచిగా ఉంటాయి. అందువల్ల తెలుగు రాష్ట్రాల్లో ఏమార్కెట్‌కు తరలించినా పోటీపడి కొనుగోలు చేస్తుంటారు. కోల్‌కతా వ్యాపారులు కూడా పోటీపడి కొనుగోలు చేస్తున్నారు. మన్యంలో కొనుగోలు చేసిన వ్యాపారులందరికీ మంచి ఆదాయం వస్తోంది.

– నల్లమిల్లి సూరిబాబు, పండ్ల వ్యాపారి, రాజమండ్రి

ప్రజావసరాలకు అనుగుణంగా పాలన

- రాష్ట్రంలో అందరికీ ఉచిత విద్య, వైద్యం
- సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు



మాట్లాడుతున్న కొమ్మినేని శ్రీనివాసరావు



విద్యార్థిని సత్కరిస్తున్న కొమ్మినేని శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి

పాడేరు రూరల్ : ప్రజల ప్రాథమిక అవసరాలను గుర్తించి వారికి విద్య, వైద్యం ఉచితంగా సక్రమంగా అందించే ప్రభుత్వాలు చాలా గొప్పవని, రాష్ట్రంలో ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ప్రజలకు ఆ రెండు సక్రమంగా అందుతున్నాయని సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. బుధవారం పాడేరు పర్యటనకు వచ్చిన ఆయన స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో వైఎస్సార్ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో అవర్ స్టేట్ అవర్ లీడర్ కార్యక్రమంలో భాగంగా సుపరిపాలన దిశగా ఆంధ్రప్రదేశ్ రూపాంతరం అనే అంశంపై నిర్వహించిన సదస్సులో మాట్లాడారు. గిరిజన ప్రాంతంలో గిరిజన ప్రకృతి, సంస్కృతి చాలా గొప్పదన్నారు. ఇంటింటికి రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందాలనే గొప్ప లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను నెలకొల్పారన్నారు. పాఠశాలల్లో నాడు-నేడు పథకం ద్వారా సమూల మార్పులు తీసుకువచ్చి పేద విద్యార్థులందరికీ అందని ద్రాక్షగా ఉన్న అంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టారన్నారు. బైజూస్ వంటి పెద్ద సంస్థలతో ఒప్పందం చేసుకొని వారికి ట్యాబ్‌లు కూడా అందించారన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను అందుకోవాలనే ఉద్దేశంతో పేద విద్యార్థులందరికి జగనన్న అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, విదేశీ విద్యా దీవెన వంటి పథకాలతో తోడ్పాటు అందిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతనిచ్చి పేద విద్యార్థులకు కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యను అందించడం గొప్ప విషయమన్నారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఐటీడీఏ ఆధ్వర్యంలో వేపగుంటలో నిర్వహించిన సివిల్స్ శిక్షణ తరగతుల్లో కూడా గిరిజన విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వడం ద్వారా ఇద్దరు గ్రూప్-1 ఉద్యోగాలు సాధించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాల వల్ల నేడు ఏజెన్సీలో ఆదివాసీ గిరిజన విద్యార్థులు సైతం ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారన్నారు. సుపరిపాలన దిశగా అంధ్రప్రదేశ్ అనే అంశంపై సమగ్రంగా మాట్లాడిన ఇద్దరు విద్యార్థులు జన్నీ సాయికిరణ్, పామర్తి హేమంజలిని కొమ్మినేని శ్రీనివాసరావు, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి సత్కరించారు.

ఆశ్రమ పాఠశాల సందర్శన

పట్టణంలోని శ్రీ కృష్ణపురం గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను సీఆర్ మీడియా అకాడమి చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు సందర్శించారు. విద్యార్థులు,వారి తల్లిదండ్రులతో ముచ్చటించారు. అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానాలు చెప్పిన పాఠశాల విద్యార్థినులు పవిత్ర, మనీషా లేఖలను అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవోలు ప్రభాకర్‌రావు, వెంకటేశ్వరరావు, జిల్లా విద్యాశాఖాధికారి సలీంబాషా, ఎస్ఎస్‌డీలు శ్రీనివాస జీవన్, శాంతమూర్తి, ఐటీడీఏ ఏవో హేమలత, ఏటీడబ్ల్యూవో రజని, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సరస్వతి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు పాల్గొన్నారు.

సీతారాముల ప్రచార రథం ప్రారంభం

సాక్షి,పాడేరు: పలు ఆధ్యాత్మిక సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీతారాముల ప్రచార రథాన్ని బుధవారం స్థానిక మోదకొండమ్మతల్లి ఆలయం వద్ద ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ప్రారంభించారు. సీతారాముల విగ్రహాలను ఆమె దర్శించుకున్నారు. నిర్వాహకులు సంజయ్, సోములు పాల్గొన్నారు.

రథాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



కోలుకుంటున్న బస్సు ప్రమాద బాధితులు

తొమ్మిది మంది డిశ్చార్జ్



జిల్లా ఆస్పత్రిలో బాధితుడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న సూపరింటెండెంట్ కృష్ణారావు

సాక్షి,పాడేరు: పాడేరు ఘాట్ లోయలోకి ఆర్టీసీ బస్సు దూసుకెళ్లిన ఘటనలో గాయాలపాలైన వారు కోలుకుంటున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు క్షతగాత్రులందరికీ స్థానిక జిల్లా ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయి. జిల్లా ఇన్‌చార్జి మంత్రి గుడివాడ అమర్‌నాథ్,కలెక్టర్ సుమిత్‌కుమార్ ఎప్పటికప్పుడు వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీస్తుండడంతో పాటు వైద్య బృందాలను అప్రమత్తం చేస్తున్నారు. జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.కృష్ణారావు, వైద్యులు, సిబ్బంది బాధితులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నారు. తీవ్రగాయాలతో విశాఖలోని మెడికవర్ కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్పిన కిల్లో బోడిరాజు,బొట్ట చిన్నమ్మలు కోలుకుంటున్నట్టు అధికారవర్గాలు తెలిపాయి. పాడేరు జిల్లా ఆస్పత్రిలో చేరిన 26మంది క్షతగాత్రులలో బుధవారం సాయంత్రానికి తొమ్మిది మంది ఆరోగ్యం కుదుటపడడంతో డిశ్చార్జ్ చేశారు. మిగతా 17మంది ఇక్కడ వైద్యసేవలు పొందుతున్నారు.

ప్రమాదాల నివారణే లక్ష్యం

- పాడేరు ఘాట్‌రోడ్డులో పరిస్థితి మెరుగుకు కలెక్టర్ ఆదేశాలు
- తుప్పలు తొలగింపు చేపట్టిన ఆర్అండ్‌బీ అధికారులు



మినుములూరు రోడ్డులో తుప్పల తొలగింపు

సాక్షి,పాడేరు: పాడేరు నుంచి మైదాన ప్రాంతాలకు పోయే ప్రధాన ఘాట్ రోడ్డులో ప్రమాదాల నివారణే లక్ష్యంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ చర్యలు చేపట్టారు. వంతాడపల్లి అటవీశాఖ చెక్‌పోస్టు నుంచి ఘాట్ దిగువున గరికబంద మోదకొండమ్మతల్లి ఆలయం వరకు 30 కిలోమీటర్ల రోడ్డుకు ఇరువైపులా తుప్పలు,డొంకలు తొలగించాలని ఆయన ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. రోడ్డును అనుకుని కూలడానికి సిద్ధంగా ఉన్న చెట్లు,రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను పూర్తిగా తొలగించాలని ఆయన ఆదేశించారు. ఈమేరకు వంతాడపల్లి నుంచి మినుములూరు వెళ్లే రోడ్డులో తుప్పలు తొలగింపు పనులు చేపట్టారు. గురువారం నుంచి కూలీల సంఖ్య పెంచి పనులు వేగవంతం చేస్తామని ఆర్అండ్‌బీ ఈఈ బాలసుందరాబు తెలిపారు.

క్లుప్తంగా

సీఐ అశోక్‌కుమార్ సేవలు అభినందనీయం



సీఐ అశోక్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ కుమారి తదితరులు

గూడెంకొత్తవీధి: నేరాలు అదుపు చేయడంలో సీఐ అశోక్‌కుమార్ చేపట్టిన చర్యలు అభినందనీయమని ఎంపీపీ బోయిన కుమారి అన్నారు. మండల కేంద్రంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఉత్తమ సీఐగా పలు అవార్డులతో పాటు, జాతీయ స్థాయిలో ప్రెసిడెంట్ మెడల్‌కు ఎంపికైన అశోక్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కుమారి మాట్లాడుతూ గంజాయి సాగు నివారణతో పాటు అంతరాష్ట్ర దారి దోపిడి ముఠాను పట్టుకోవడం, మహారాష్ట్రలో స్మగ్లర్ల చెరలో బందీలుగా ఉన్న గిరిజనులను విడిపించడంలో సీఐ చూపిన చొరవ ఎన్నటికీ మరువలేమన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్ వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఎం.మత్స్యరాజు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల ముమ్మర తనిఖీలు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో బుధవారం పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు.ముఖ్యంగా మారుమూల బూసిపుట్టు, కుమడ, బాబుశాల, రంగబయలు, బుంగాపుట్టు పంచాయతీల నుంచి వచ్చే ఆటోలు, జీపులు, ద్విచక్రవాహనాలను నిలిపి, ప్రయాణికుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రయాణికుల లగేజీలు, బ్యాగులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానితుల వివరాలు సేకరించి విడిచి పెట్టారు. సీఆర్‌పీఎఫ్ బలగాలు మండల కేంద్రంలో నలుమూలల డేగ కన్నుతో పహారా కాశారు.

ఇంటర్న్‌షిప్‌నకు దరఖాస్తుల ఆహ్వానం

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం–ఏపీఎస్ఎస్‌డీసీ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ సంయుక్తంగా 60 రోజుల పాటు నిర్వహించే ఇండస్ట్రీ ఓరియంటేషన్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంకి డిప్లమా, బీటెక్, ఎంటెక్ విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కేంద్రం నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి అక్టోబర్ 30వ తేదీ వరకు ఈ శిక్షణ కార్యక్రమం జరుగుతుందన్నారు. కోర్సు ఫీజుగా రూ.10 వేలు చెల్లించాలన్నారు. మొత్తం 7 కోర్సుల్లో విద్యార్థులకు శిక్షణ అందిస్తారు. వివరాలకు 98480820995, 9652690534 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

లీగ్ టాపర్‌గా రైడర్స్

విశాఖ స్పోర్ట్స్: కోస్టల్ రైడర్స్ మరోసారి ప్లేఆఫ్‌కు చేరుకుంది. ఏపీఎల్ సీజన్–2 లీగ్ చివరి మ్యాచ్‌లో రాయలసీమ కింగ్స్‌పై విజయం సాధించి 16 పాయింట్లతో టాప్‌లో నిలిచింది. వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో బుధవారం జరిగిన తొలి మ్యాచ్‌లో టాస్ గెలిచిన కోస్టల్ రైడర్స్ లక్ష్య ఛేదనకే మొగ్గు చూపింది. బ్యాటింగ్‌కు దిగిన రాయలసీమ కింగ్స్ 18 ఓవర్లలో 131 పరుగులు చేసింది. వరుణుడు 13 ఓవర్ వద్ద అంతరాయం కలిగించగా.. అప్పటికి కింగ్స్ జట్టు ఏడు వికెట్లకు 98 పరుగులు చేసింది. కెప్టెన్ హనుమ విహారి డకౌట్‌గానే వెనుదిరగ్గా.. మరో ఓపెనర్ వీరారెడ్డి 45 బంతుల్లో ఐదు ఫోర్లు, ఆరు సిక్సర్లతో 78 పరుగులు సాధించాడు. చివర్లో కమరుద్దీన్(21 బంతుల్లో మూడు ఫోర్లు, సిక్సర్‌తో 23 పరుగులు)తో కలిసి స్కోర్‌ను ముందుకు నడిపాడు. తిరిగి ఆటను కొనసాగించగా కింగ్స్ తొమ్మిది వికెట్లు కోల్పోయి 131 పరుగులు చేయగా.. మరోసారి వర్షం కారణంగా ఆటను 18వ ఓవర్ వద్ద నిలిపివేశారు. అబ్దుల్లా నాలుగు వికెట్లు తీయగా స్టీఫెన్, మనోహర్ రెండేసి వికెట్లు పడగొట్టారు. దీంతో కోస్టల్ రైడర్స్‌కు డీఎల్ఎస్ పద్ధతిలో 17 ఓవర్లలో 124 పరుగుల విజయలక్ష్యాన్ని నిర్దేశించారు. 14 ఓవర్లలోనే రెండు వికెట్లకు 127 పరుగులతో రైడర్స్ విజయం సాధించారు. ఓపెనర్ ధరణీకుమార్(18), కెప్టెన్ రషీద్(4) వికెట్లను 65 పరుగులకే రైడర్స్ కోల్పోయింది. మరో ఓపెనర్ ప్రణీత్ 40 బంతుల్లో ఆరు ఫోర్లు, మూడు సిక్సర్లతో 64, చిరంజీవి 20 బంతుల్లో మూడు ఫోర్లు, రెండు సిక్సర్లతో 32 పరుగులతో అజేయంగా నిలిచి జట్టుకు విజయాన్నందించారు. కమరుద్దీన్, హనుమ విహారి చెరో వికెట్ తీశారు.



చెలరేగిన రైడర్ చిరంజీవి

చేతులెత్తేసిన టైటాన్స్

విశాఖ స్పోర్ట్స్: తప్పనిసరిగా గెలవాల్సిన మ్యాచ్‌లో గోదావరి టైటాన్స్ చేతులెత్తేసింది. వైఎస్సార్ స్టేడియంలో జరిగిన రెండో మ్యాచ్‌లో టైటాన్స్ టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్‌కు దిగింది. ఓపెనర్లు కెప్టెన్ జ్ఞానేశ్వర్(2), హేమంత్(1) ఎనిమిది పరుగులకే పెవిలియన్‌కు చేరారు. శ్యామ్ 11 పరుగులు చేసి తేజస్వికి దొరికిపోగా సమన్విత్ 14 పరుగులతో పృథ్వీ బౌలింగ్‌లో కీపర్ భరత్‌కు దొరికిపోయాడు. చివర్లో సత్యనారాయణ 16 పరుగులతో అయ్యప్ప బౌలింగ్‌లో బౌల్డయ్యాడు. మిగిలిన వారంతా సింగిల్ డిజిట్ స్కోర్లకే పరిమితమయ్యారు. మరో బంతి ఉండగానే టైటాన్స్ 77 పరుగులకే ఆలౌటైంది. పృథ్వీ, తేజస్వి మూడేసి వికెట్లు తీయగా అయ్యప్ప రెండు, అజయ్, వాసు ఒక్కో వికెట్ పడగొట్టారు. స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన ఉత్తరాంధ్ర లయన్స్ ఓపెనర్ కెప్టెన్ భరత్(4), అతని స్థానంలో వచ్చిన రోహిత్ డకౌట్‌గా మల్లికార్జున వేసిన రెండు వరస బంతుల్లోనే పెవిలియన్ చేరారు. ఓపెనర్ గుల్ఫమ్(29)కు రాహుల్ తోడై మూడో వికెట్‌కు 50 పరుగుల భాగస్వామ్యం అందించాడు. రాహుల్(33), తపస్వి(10) అజేయంగా నిలిచి 13.4 ఓవర్లలోనే 79 పరుగుల చేసి జట్టుకు విజయాన్నందించారు. మల్లికార్జున రెండు వికెట్లు, కమిల్ ఓ వికెట్ తీశాడు.

ప్లేఆఫ్‌కు వీరే...

లీగ్ చివరి మ్యాచ్ ఏడు వికెట్ల తేడాతో పరాజయం పాలైన గోదావరి టైటాన్స్ ప్లే ఆఫ్ అవకాశాన్ని కోల్పోయింది. 16 పాయింట్లతో కోస్టల్ రైడర్స్ ఆధిక్యాన్ని ప్రదర్శించింది. ఉత్తరాంధ్ర లయన్స్, రాయలసీమ కింగ్స్ జట్లు 12 పాయింట్లు సాధించగా.. మెరుగైన రన్ రేట్‌తో లయన్స్ రెండో స్థానంలో నిలిచింది. బెజవాడ టైగర్స్, గోదావరి టైటాన్స్ ఎనిమిదేసి పాయింట్లతో నిలిచినా మెరుగైన రన్‌రేట్‌తో టైగర్స్ ప్లేఆఫ్‌కు అర్హత సాధించారు. దీంతో ఎలిమినేటర్ మ్యాచ్‌లో కింగ్స్‌తో టైగర్స్ తలపడనుండగా క్వాలిఫైయిర్ వన్‌లో రైడర్స్‌తో లయన్స్ తలపడనుంది. వైజాగ్ వారియర్స్ నాలుగు పాయింట్లతో రెండో సీజన్ ముగించింది.

120 కిలోల గంజాయి పట్టివేత

ముగ్గురు నిందితుల అరెస్టు

పెదబయలు : మండలంలోని గిన్నెలకోట పంచాయతీ చింతగరువు జంక్షన్‌లో ఆటోలో తరలిస్తున్న తరలిస్తున్న 120 కిలోల గంజాయిని పట్టుకోవడం జరిగిందని స్థానిక జి.మాడుగుల సీఐ సత్యనారాయణ, ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపారు. ఈ నెల 22 తేదీన చింతగరువు జంక్షన్‌లో తనిఖీలు చేస్తుండగా ఆటోలో నాలుగు బస్తాల్లో 120 కిలోల గంజాయి బయటపడిందన్నారు. పెదబయలు మండలం గిన్నెలకోట పంచాయతీ ఇనుపతీగలు గ్రామానికి చెందిన కొర్రా త్రినాథ్, మర్రి సన్యాసిరావు, గోమంగి పంచాయతీ నేరోడిపుట్టు గ్రామానికి కిల్లో బాబూరావును అదుపులో తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. కాగా గోమంగి పంచాయతీ కుమ్మరివీధి గ్రామానికి చెందిన గంపరాయి సత్యబాబు (సత్యం), ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా జడంబో బ్లాక్ సిమిలిగుడ గ్రామానికి చెందిన చిక్కుడు రూహిణి పరారయ్యారని, వారిని త్వరలో పట్టుకుంటామని తెలిపారు. ఆటో సీజ్ చేసి, ముగ్గురు నిందితులను రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

25 నుంచి ఎస్ఐ అభ్యర్థులకు దేహ దారుఢ్య పరీక్షలు



కైలాసగిరి ఏఆర్ పోలీస్ మైదానంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న రేంజ్ డీఐజీ హరికృష్ణ

ఆరిలోవ: స్టైఫండరీ క్యాడెట్ ట్రైనీ ఎస్ఐల నియామకాల్లో భాగంగా అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షల కోసం విశాఖ రేంజ్ పోలీస్ ఉన్నతాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కైలాసగిరిలోని ఏఆర్ పోలీస్ మైదానంలో ఈ నెల 25 నుంచి సెప్టెంబర్ 23 వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. విశాఖ రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ అనకాపల్లి ఎస్పీ కె.వి.మురళీకృష్ణతో కలసి బుధవారం మైదానాన్ని సందర్శించారు. పరీక్షల నిర్వహణ కోసం ఇంతవరకు జరిగిన ఏర్పాట్లను పరిశీలించారు. మిగిలిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎస్పీని ఆదేశించారు. డీఐజీ మాట్లాడుతూ విశాఖ రేంజ్ పరిధిలో నిర్వహించిన రాత పరీక్షలో 17,374 మంది అభ్యర్థులు అర్హత సాధించారన్నారు. వారికి ఈ నెల 25 నుంచి శరీర దారుఢ్య పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అలాగే ప్రాథమిక పరీక్షలో అర్హత సాధించిన 2,745 మంది మహిళా అభ్యర్థులకు ఈ నెల 30 నుంచి సెప్టెంబర్ 2 వరకు ప్రత్యేకంగా దేహదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు మెటాలిక్, స్పైక్ షూస్ ధరించి రావద్దని సూచించారు. అడిషనల్ ఎస్పీ దిలీప్ కిరణ్, అదనపు ఎస్పీ బి.విజయ భాస్కర్, ఏఆర్ అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, ఆర్ఐలు పాల్గొన్నారు.



ఏర్పాట్లపై అనకాపల్లి ఎస్పీ మురళీకృష్ణతో మాట్లాడుతున్న రేంజ్ డీఐజీ హరికృష్ణ

అమలుకాని మెనూ.. విద్యార్థుల ఆందోళన



దుంబ్రిగుడ బాలుర ఆశ్రమ పాఠశాలలో మెనూ అమలుచేయాలని ఆందోళన చేస్తున్న విద్యార్థులు

దుంబ్రిగుడ: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో కొంతకాలంగా అమలు కాని మెను సమస్యపై విద్యార్థులు బుధవారం నిరసన తెలిపారు. పాఠశాలలో ఉదయం అల్పాహారం తీసుకోకుండా ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో సక్రమంగా మెను అమలు చేయాలని ఆదేశించి, చార్జీలను పెంచినా కూడా తమ పాఠశాలలో అమలుచేయడం లేదన్నారు. రాత్రి వంట చేసిన అన్నం, కూర ఉదయం పెడుతున్నారని, వార్డన్‌ను అడిగినా కూడా కనీసం పట్టించుకోవడం లేదని, రెండు వారాలుగా దొండకాయ కూర మాత్రమే ఇస్తున్నారని వారు ఆరోపించారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి, హాస్టల్ నిర్వహకులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై హాస్టల్ వార్డన్ రామును మాట్లాడుతూ ఇడ్లీకు బదులుగా కిచిడి పెట్టింది వాస్తవమేనన్నారు. ఇడ్లీ కోసం రుబ్బు చేసే గ్రైండర్ పాడవడంతో ఈ పరిస్థితి వచ్చిందన్నారు.దొండకాయలు పాడైపోతాయని రెండు రోజులుగా కూర ఇచ్చామని, మెనూ సక్రమంగా అమలుచేస్తున్నామన్నారు. విద్యార్థుల ఆందోళన విషయాన్ని తెలుసుకున్న ఏటీడబ్ల్యూవో మల్లికార్జునరావు స్పందించి తక్షణమే పాఠశాలను సందర్శించి, జరిగిన విషయాన్ని తెలుసుకునానరు. ఇటువంటి సంఘటన పునరావృతం కాకుండా చూసుకోవాలని వార్డన్‌ను ఏటీడబ్ల్యూవో హెచ్చరించారు. మెను సక్రమంగా అమలు చేయాలని ఆయన ఆదేశించారు.



- చంద్రయాన్–3 సక్సెస్‌తో జిల్లా వ్యాప్తంగా సంబరాలు
- పాఠశాలల్లో ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించిన విద్యార్థులు

చంద్రయాన్–3 విజయ సంబరాల్లో విశాఖ ప్రజలు మునిగితేలారు. వినువీధిలో భారత కీర్తి పతాకను రెపరెపలాడించి.. 140 కోట్ల భారతీయుల కలను నిజం చేసిన ఇస్రో సాహో అంటూ నినదించారు. భారత వైజ్ఞానిక సత్తాను మన శాస్త్రవేత్తలు ప్రపంచానికి చాటి చెప్పారన్నారు. సైకిల్‌పై రాకెట్ విడి భాగాలు మోసుకెళ్లిన రోజు నుంచి విక్రమ్ ల్యాండర్‌ను జాబిల్లిపై విజయవంతగా దింపిన క్షణం వరకు ఇస్రో ప్రయాణం అద్భుతమని కొనియాడారు.

ఏయూక్యాంపస్: భారతదేశ సాంకేతిక, పరిశోధన ప్రగతికి చిహ్నంగా చంద్రయాన్–3 నిలుస్తుందని ఏయూ ఆచార్యులు అన్నారు. జాబిల్లిపై విక్రమ్ ల్యాండింగ్ ప్రక్రియను బుధవారం ఏయూ భౌతిక శాస్త్ర విభాగ సమావేశ మందిరంలో విద్యార్థులతో కలిసి ప్రత్యక్షంగా వీక్షించారు. విక్రమ్ చంద్రుడిపై దిగగానే విద్యార్థులు పెద్ద ఎత్తున హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. చప్పట్లతో తమ ఆనందాన్ని పంచుకున్నారు. ఇస్రో శాస్త్రవేత్తల బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.



జాబిల్లిపై విక్రమ్ ల్యాండింగ్‌ను వీక్షిస్తున్న విద్యార్థులు, ప్రొఫెసర్లు

అభివృద్ధి చెందిన దేశంగా భారత్



చంద్రయాన్–3 విజయం సాధించడం వల్ల భారత్ అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలుస్తుంది. దేశీయంగా తయారు చేసిన పరికరాలతో జరిగిన ప్రయోగం ఇది. భారత దేశ సామర్థ్యాలు నేడు ప్రపంచానికి తెలిశాయి. స్పేస్ టెక్నాలజీలో అవకాశాలు విస్తృతం అవుతాయి.
– డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, విభాగాధిపతి

దేశానికి గర్వకారణం



చంద్రయాన్ ప్రయోగం విజయవంతం కావడం దేశానికి గర్వకారణం. అపజయాల నుంచి భారత్ అంతరిక్ష పరిశోధన సంస్థ విజయాలకు బాట వేసుకుంది. మరిన్ని ప్రయోగాలు జరగాలని కోరుకుంటున్నాను. ఈ ఆనందం మాటల్లో వర్ణించలేనిది.
– బి.సుష్మ, విద్యార్థిని

కష్టతరమైన ప్రయోగం



దక్షిణ ధృవంపై విక్రమ్ ల్యాండర్‌ను ఇస్రో విజయవంతంగా దింపింది. అక్కడ వాతావరణ పరిస్థితులు, జీవుల జాడ, నీటి వనరులు వంటివి తెలుసుకోవచ్చు. ఇటీవల రష్యా ప్రయోగం విఫలం అవడంతోకొంత ఒత్తిడికి గురయ్యాం. ఈ విజయం ఎంతో సంతోషాన్ని కలిగించింది.
– బి.సాయి కుమార్, విద్యార్థి

15 కిలోల గంజాయి స్వాధీనం

అనకాపల్లిటౌన్: బవులవాడ సమీపంలో బుధవారం 15 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్టు చేసినట్టు రూరల్ ఎస్ఐ నర్సింగరావు చెప్పారు. పాడేరు నుంచి అనకాపల్లికి గంజాయి తరలిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు తమ సిబ్బంది బుధవారం వాహనాలు తనిఖీ చేశారని చెప్పారు. తమ సిబ్బందిని గంజాయి రవాణాదారులు గమనించారని, మరో వాహనంలో అనకాపల్లికి వచ్చేందుకు ప్రయత్నిస్తుండగా అరెస్టు చేసినట్టు ఎస్ఐ చెప్పారు. మరో వ్యక్తి పరారీలో ఉన్నట్టు తెలిపారు. ఇద్దరు నిందితులను కోర్టులో హాజరుపర్చినట్టు ఎస్ఐ చెప్పారు.

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి అలపాటి గిరిధర్


విశాఖ లీగల్ : లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారం జరిగి, సత్వర న్యాయం జరుగుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి అలపాటి గిరిధర్ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి కాన్ఫరెన్సు హాలులో కోఆర్డినేషన్ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 9వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా అన్ని కోర్టుల్లో అన్ని రకాల కేసులు పెద్ద సంఖ్యలో రాజీ చేయాలన్నారు. కార్యక్రమంలో మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎస్.శ్రీదేవి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి.శేషమ్మ, బార్ ప్రెసిడెంట్ చింతపల్లి రాంబాబు, బార్ కౌన్సిల్ ప్రతినిధులు బైపా అరుణ్ కుమార్, అదనపు జిల్లా న్యాయమూర్తులు, సీనియర్ న్యాయమూర్తులు, న్యాయవాదులు, రెవెన్యూ అధికారులు, ఇన్సూరెన్సు కంపెనీ ప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో 27 నుంచి విద్యార్థులకు పోటీలు

కొమ్మాది: శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా సాగర్‌నగర్‌లోని ఇస్కాన్ టెంపుల్‌లో విద్యార్థులకు పలు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 27 నుంచి వ్యాసరచన, చిత్రలేఖనం, కృష్ణ లీలలపై పరీక్ష, భగవద్గీత శ్లోక పారాయణం, వంటలు, పూల అలంకరణ, రంగోలి తదితర పోటీలు ప్రారంభమవుతాయన్నారు. వచ్చే నెల 6 నుంచి 8వ తేదీ వరకు కృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తామన్నారు. పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు 94417 92704, 63059 52060, 99455 04309 నంబర్లలో సంప్రదించవచ్చు.

విద్యార్థులు అదనపు నైపుణ్యం కలిగి ఉండాలి

డీఆర్‌డీఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సోనీడైసీ



జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సోనీడైసీ

అనకాపల్లిటౌన్: విద్యార్థులు విద్యతో పాటు అదనపు నైపుణ్యం కలిగి ఉండాలని డీఆర్‌డీఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సోనీ డైసీ అన్నారు. స్థానిక డైట్ కళాశాల ఆవరణలో బుధవారం జిల్లా యువజనోత్సవాలను ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సెట్విస్ అండ్ యూత్ సర్వీసెస్ జిల్లా మేనేజర్ కె.వి.ఎస్.ఎన్.మూర్తి మాట్లాడుతూ స్వామి వివేకానంద సిద్ధాంతాలపై యువతకు అవగాహన కల్పించేందుకు ఈ యువజనోత్సవాలు జరుపుకోవడం ఎంతో అవసరం అన్నారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ తనకు నచ్చిన రంగంలో రాణించేందుకు విద్యార్థులు కృషి చేయాలన్నారు. ప్రతి విద్యార్థి ఒక గోల్‌ను నిర్దేశించుకోవాలని, కృషి, పట్టుదల ఉంటే సాధించి తీరుతామన్నారు. నృత్యం, పాటలు, పోస్టర్, స్టోరీ రైటింగ్, ఫొటోగ్రఫీ విభాగాల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. విజేతలైన వారికి దాడి రత్నాకర్ షీల్డ్, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అంతకుముందు వివిధ కళాశాలల నుంచి హాజరైన విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విశాఖ నెహ్రూ యువ కేంద్రం జిల్లా కో ఆర్డినేటర్ మహేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

నెలరోజుల్లో క్రూయిజ్ టెర్మినల్ ప్రాజెక్టు ప్రారంభిస్తాం

- రాష్ట్ర ప్రభుత్వ సహకారంతోనే పోర్టు అభివృద్ధి
- జీఎంఐఎస్–2023తో సముద్ర రవాణాలో మరిన్ని అవకాశాలు
- విశాఖ పోర్టు అథారిటీ చైర్మన్ డాక్టర్ అంగముత్తు



మాట్లాడుతున్న పోర్టు చైర్మన్ డా.అంగముత్తు, ఏపీ మారీటైమ్ బోర్డు డిప్యూటీ సీఈవో రవీంద్రనాథ్‌రెడ్డి, పోర్టు డిప్యూటీ చైర్మన్ దూబే

సాక్షి, విశాఖపట్నం : అంతర్జాతీయ పర్యాటకుల్ని ఆకర్షించేలా విశాఖపట్నం పోర్టు కేంద్రంగా తూర్పు తీరంలో నిర్మించిన తొలి క్రూయిజ్ టెర్మినల్‌ను మరో నెల రోజుల్లో ప్రారంభించనున్నామని పోర్టు చైర్మన్ డా.అంగముత్తు ప్రకటించారు. అక్టోబర్‌లో న్యూఢిల్లీలో కేంద్ర పోర్టులు, నౌకాయాన, జలరవాణా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న గ్లోబల్ మేరీటైమ్ ఇండియా సమ్మిట్–2023కు ఆహ్వానం పలుకుతూ విశాఖ పోర్టు అథారిటీ ఆధ్వర్యంలో రోడ్‌షో పేరుతో బుధవారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సును ప్రారంభించిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి గుడివాడ అమర్‌నాథ్.. రూ.16 వేల కోట్లతో ప్రభుత్వం నిర్మిస్తున్న కొత్త పోర్టుల వల్ల.. రాష్ట్ర అభివృద్ధి పరుగులు పెడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సదస్సు అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో పోర్టు చైర్మన్ డా.అంగముత్తు మాట్లాడుతూ జీఎంఐఎస్–2023 ద్వారా సముద్రయాన రంగం సుస్థిరత వైపు అడుగులు వేస్తుందని అభిప్రాయపడ్డారు. నౌకాయాన అభివృద్ధి, పురోగతికి ఎంతో దోహదపడుతుందన్నారు. ఢిల్లీలో జరిగే సమ్మిట్‌లో ఏపీ ప్రభుత్వంతో పాటు నౌకాయాన రంగంలో ఉన్న పారిశ్రామిక వేత్తలు పెద్ద ఎత్తున భాగస్వామ్యం కావాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పర సహకారంతో ఆంధ్రప్రదేశ్‌తో పాటు విశాఖపట్నం అభివృద్ధి దిశగా పయనిస్తున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో పోర్టును మరింత సుస్థిర అభివృద్ధి చేయడంతో పాటు, సామర్థ్యాన్ని విస్తరింపజేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. స్టేక్ హోల్డర్స్, విశాఖ ప్రజల సహకారంతో... సులభతర వాణిజ్య అవకాశాలకు స్వర్గధామంగా పోర్టు అడుగులు వేస్తోందని వివరించారు. పర్యాటక రంగానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి అన్ని విధాలా సహకారం అందుతోందన్నారు. పోర్టులో నిర్మిస్తున్న క్రూయిజ్ టెర్మినల్ పనులు దాదాపు పూర్తయ్యాయనీ.. నెలరోజుల్లో ప్రారంభించనున్నామని తెలిపారు. ఏపీ మారీటైమ్ బోర్డు డిప్యూటీ సీఈవో లెఫ్టినెంట్ కమాండర్ బీఎం రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ పోర్టులకు అనుసంధానంగా పారిశ్రామిక అభివృద్ధి జరుగుతోందనీ... అందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దూరదృష్టితో ఆలోచించి.. ప్రస్తుతం రాష్ట్రంలో నిర్మిస్తున్న ప్రతి పోర్టుకు అనుబంధంగా 4 వేల ఎకరాల వరకూ ల్యాండ్ బ్యాంక్‌ని అభివృద్ధి చేస్తున్నారని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రాయితీలు వినియోగించుకొంటూ ఔత్సాహిక పెట్టుబడిదారులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దూబే పాల్గొన్నారు.

ఏయూతో ఐసీటీ అకాడమీ ఎంవోయూ



అవగాహన ఒప్పందం చేసుకుంటున్న ఏయూ, ఐసీటీ ప్రతినిధులు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంతో ఐసీటీ అకాడమీ అవగాహన ఒప్పందం చేసుకుంది. ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత సమక్షంలో ఒప్పంద పత్రాలపై బుధవారం రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఐసీటీ అకాడమీ సీఈవో హరి బాలచంద్ర సంతకాలు చేశారు. ఒప్పందంలో భాగంగా ఐసీటీ అకాడమీకి నోడల్ కేంద్రంగా ఏయూ నిలవనుంది. ఏయూ ఆచార్యులకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్–కమ్యూనికేషన్ టెక్నాలజీ, మేనేజ్‌మెంట్ విభాగాల్లో అవసరమైన సేవలను ఐటీసీ అందిస్తుంది. ఈ సేవలను ఏయూతో పాటు అనుబంధ కళాశాలల అధ్యాపకులు పొందే అవకాశం ఉంది. ఏయూ ఆచార్యుల పరిశోధన పత్రాలను ఐసీటీ జర్నల్స్‌లో ప్రచురిస్తారు. ఏయూ అలుమ్ని అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఇ.శంకర రావు, మీడియా రిలేషన్స్ డీన్ ఆచార్య చల్లా రామకృష్ణ, ఐసీటీ అకాడమీ స్టేట్ హెడ్ దినకర్ రెడ్డి, రీజినల్ మేనేజర్ బి.ప్రవీణ్ కుమార్, ఏయూ అంబేద్కర్ చైర్ ప్రొఫెసర్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ పాల్గొన్నారు